క్లుప్తంగా

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల గడువు పెంపు

పుత్తూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీ అడ్మిషన్ల గడువును ఈనెల 16వ తేదీ వరకు పొడిగించినట్లు కోఆర్డినేటర్ టి.నరసింహులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్ పాసైన వారు, ఐటీఐ రెండేళ్ల కోర్సు పాసైన వారు, డిప్లమో పాసైన వారు డిగ్రీకి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు స్వయంగా యూనివర్సిటీ పోర్టల్ w.w.w. braou online.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9515401088 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పుత్తూరు తహసీల్దార్‌గా శ్రీనివాస్‌గౌడ్



పుత్తూరు: స్థానిక తహసీల్దార్‌గా కె.శ్రీనివాస్‌గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు జిల్లా డోన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న పరమేశ్వరస్వామి అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు.

నిండ్ర ఎంపీడీఓగా భవాని



నిండ్ర: మండల ఎంపీడీఓగా భవాని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ అరుణ బదిలీ అయ్యా రు. దీంతో నెల్లూరు జిల్లా నుంచి భవాని ఇక్కడికి బదలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న మున్సిపల్ చైర్మన్

నగరి : మున్సిపాలిటీలోని సత్రవాడ దళితవాడలో గత ఏడాది తుపాను ప్రభావంతో ఇంటిగోడ శిథిలమైన బాధితురాలు సుబ్బమ్మకు ప్రభుత్వం నుంచి రూ.15 వేలు ఆర్థికసాయం మంజూరు చేసింది. బుధవారం మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం బాధితురాలి ఇంటివద్దకు వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, కౌన్సిలర్ భూపాలన్, ఇళంగో తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: మండలంలోని బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు, కమిటీ చైర్మన్లపై ఉందని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ అన్నారు.. బుధవారం సాయంత్రం ఎమ్మార్సీ భవనంలో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్లు, సీఆర్పీలతో సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. గ్రామాల్లో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. నాడు –నేడు పథకం కింద చేస్తున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.


ఏడు పంచాయతీలకు వీధిలైట్లు



సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, మహేష్‌కు వీధిలైట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్

పాలసముద్రం: మండలంలోని ఏడు పంచాయతీలకు ఎంపీ నిధులతో వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ బుధవారం తెలిపారు. మండలంలోని ఎస్‌ఆర్‌ఆర్ కండ్రిగ, శ్రీకావేరిరాజుపురం, సింహరాజుపురం, పాలసముద్రం, ఆముదాల, బాలకృష్ణాపురం, వెంగళరాజుకుప్పం పంచాయతీలకు రూ.లక్ష చొప్పున మొత్తం రూ.7 లక్షల విలువ చేసే వీధిలైట్లను ఆయా పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, అను రేఖ, మహేష్, షీబా, లిల్లీ, అయ్యప్ప, పంచాయతీ కార్యదర్శులు రాజూవ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు

శ్రీరంగరాజపురం: ఇటీవల మండలం నుంచి చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ బదిలీపై వెళ్లిన ఎస్‌ఐ షేక్షావలికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు బుధవారం వీడ్కోలు పలికి, సన్మానం చేశారు. సీఐ సత్యబాబు మాట్లాడుతూ, మండలంలో పెండింగ్ కేసులను పరిష్కరించడంలో షేక్షావలి ప్రత్యేక శ్రద్ధ చూపారని అన్నారు. ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, కాపు సంఘం మండల అధ్యక్షులు విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేకం.. ఆధ్యాత్మిక శోభితం

- నేత్రప్రదాయని కుంభాభిషేకోత్సవంలో వాస్తుయాగం
- ఆకట్టుకుంటున్న దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు



కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి



విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన అమ్మవారి కటౌట్

నగరి : నేత్ర ప్రదాయని దేశమ్మ దేవాలయ కుంభాభిషేక వేడుకలతో నగరి పట్టణం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో విద్యుత్ తోరణాలు, విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల ప్రతిమలు ఆకర్షిస్తున్నాయి. పట్టణమంతా ఏర్పాటు చేసిన స్పీకర్లలో వినిపిస్తున్న వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాలు ఆధ్యాత్మిక వైభవాన్ని తెచ్చి పెట్టాయి. వేడుకల్లో భాగంగా విచ్చేసిన కళాకారుల బృందాలు పట్టణ కూడళ్లలో చేసే ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. నభూతో నభవిష్యత్ అన్న చందాన కుంభాభిషేక వేడుకలు జరుగుతున్నాయి.

శాస్త్రోక్తంగా వాస్తుయాగం

కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా మూడోరోజైన బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు వాస్తుయాగం, వాస్తు పర్యగ్నికరణం, అగ్ని మథనం, అంకురోపణం, చండీశప్తపతీపారాయణం, చండీహోమం కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి ఆర్కేరోజా భర్త రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కుంభాభిషేక వేడుకలు మిన్నంటాయి. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈఓ రామచంద్రయ్య, కమిటీ సభ్యులు రాజేంద్రన్, పాండురంగం, ఆరుముగం, విజయ్, లత, కోకిల, అనిత, పూర్ణిమ, ఆలయ అర్చకులు నీలకంఠం, చెంచురామయ్య, పురుషోత్తం, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.







పట్టణ కూడలిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శన, విద్యుత్ దీప కాంతుల్లో ఆలయం, నగరిలోని వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ తోరణాలు

డ్రైవర్లకు కంటిచూపు బాగుండాలి



మాట్లాడుతున్న ఎంవీఐ చంద్రశేఖర్

పుత్తూరు: వాహన చోదకులకు కంటి చూపు వంద శాతం మెరుగ్గా ఉండాలని పుత్తూరు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం జాతీయ రహదారుల భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలన్నారు. ఆటో, ఆర్టీసీ డ్రైవర్లు, ప్రైవేట్ పాఠశాలు, కళాశాలల డ్రైవర్లు ప్రతి మూడు నెలలకొకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రహదారి నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. మోటర్ సైకిల్ నడిపే వారు విధిగా హెల్మెట్, కారు నడిపే వారు సీట్ బెల్ట్‌ను విధిగా ధరించాలన్నారు. అనంతరం కంటి పరీక్షలు చేసుకున్న డ్రైవర్లకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోడ్డు భద్రతకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రశాంతి, ఏఎంఎఫ్ జ్యోతిరెడ్డి, గుడ్‌షెపర్డ్ హాస్పిటల్ డాక్టర్లు విజయ్‌కుమార్, ప్రత్యూష, అనిత పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్లు చేస్తున్న సచివాలయ సిబ్బంది

వెదురుకుప్పం: పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. అలాగే ఇళ్ల నిర్మాణాలు కూడా చేస్తోంది. ఉచితంగానే పట్టాల రిజిస్ట్రేషన్ గ్రామ సచివాలయాల్లో ఈ నెల 8వ తేదీన నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు శరవేగంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పచ్చికాపల్లం గ్రామ సచివాలయంలో లబ్ధిదారులకు సంబంధించిన ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్లు చేశారు. డీడీఓ శ్రీనివాపసరావు, వీఆర్‌ఓ మురళి పాల్గొన్నారు.

16న దేశ వ్యాప్త సమ్మె



మాట్లాడుతున్న రామానాయుడు

పుత్తూరు: రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 16న దేశ వ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రామానాయుడు తెలిపారు. బుధవారం పట్టణంలో ప్రజా సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు ఉత్పత్తులకు కనీస ధర కల్పించడంలోనూ, కార్మికులకు కనీస వేతనం అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, సీఐటీయూ నేతలు వెంకటేష్, టీఎన్‌టీయూసీ నేత మాధవనాయుడు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ, పోటీలు రేపు

చిత్తూరు రూరల్: కట్టమంచి రామలింగారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 10న ఆ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీధర్ తెలిపారు. వ్యాసరచన పోటీల్లో 6,7 తరగతలకు కట్టమంచి రామలింగారెడ్డి బాల్యం–విద్యాభ్యాసం, 8,9,10 తరగతులకు పుఃవినియోగం ఆవశ్యకత, వక్తృత్వ పోటీల్లో 6,7 తరగతులకు పరిసరాల శుభ్రత –మన పాత్ర, 8,9,10 తరగతులకు విద్యారంగానికి కట్టమంచి రామలింగారెడ్డి చేసిన సేవలు అనే అంశంపై పోటీలు ఉంటాయన్నారు. చిత్రలేఖనంలో 6,7 తరగతులకు సీఆర్‌రెడ్డి చిత్రపటం, 8,9,10 తరగతులకు నీరు–సంరక్షణపై పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు గురువారం సాయంత్రంలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 10వతేదీ ఉదయం 10 గంటలకు పోటీలు, ఈ నెల 24వతేదీ జరిగే వర్ధంతి సభలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

టీబీ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యం



మందుల కిట్ పంపిణీ చేస్తున్న డీఐఓ రవిరాజు

నిండ్ర: టీబీ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని డీఐఓ డాక్టర్ రవిరాజు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఐఓ రవిరాజు పాల్గొని, టీబీ వ్యాధిగ్రస్తులకు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. టీబీ వ్యాధికి ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. వాటిని వైద్యుల సలహా మేరకు క్రమం తప్పకుండా వాడితే నయమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుమలత, హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సీహెచ్‌ఓ శ్రీదేవి, డీపీఎంఓ కానిక్ రాజ్, సురేష్, మల్లికాంబ, పవన్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



పాలసముద్రం : మాట్లాడుతున్న ఫరీద్ మస్తాన్

వెదురుకుప్పం: ఓటుహక్కు వినియోగంపై మండలంలోని పాతగుంట, వెదురుకుప్పంలో బుధవారం వెలుగు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు పొంది ఓటును వినియోగించుకోవాలని కోరారు. అనంతరం వెదురుకుప్పంలో సీనియర్ సిటిజన్లకు ఘనంగా సన్మానించారు. ఏపీఎం కవిత, సీసీలు, సంఘమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

పాలసముద్రం : ప్రజాస్వామ్యంలో ఓటు ఒక వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ కోరారు. మండలంలోని రాచపాళెం, సన్నగుంట గ్రామాల్లో బుధవారం డ్వాక్రా సంఘ సభ్యులతో కలసి ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంచి నాయకత్వం కోసం ఓటు వేయడం ముఖ్యమన్నారు. సీసీ చిరంజీవి, సంఘమిత్ర మరగయ్య పాల్గొన్నారు.

మామిడి రైతులకు శిక్షణ



ఎస్బీఆర్‌పురంలోని మామిడి తోటను పరిశీలించి సూచనలిస్తున్న ఉద్యానవన అధికారి

పుత్తూరు: వడమాలపేట మండలం ఎస్బీఆర్ పురం రైతు భరోసా కేంద్రంలో బుధవారం పుత్తూరు ఉద్యానవన అధికారి వెంకటసౌజన్య ఆధ్వర్యంలో రైతులకు మామిడి సస్యరక్షణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పూత ఆలస్యమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, ఫార్ములా 4 (సూక్ష్మ పోషకాలు) 5 గ్రాములు ఒక లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఇలా చేయడంతో పూత త్వరగా వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఒక ఎస్బీఆర్ పురంలోనే 1500 ఎకరాలకు పైగా ఉన్న మామిడి తోటల్లో తేనె మంచు పురుగు/బంక సమస్య అధికంగా ఉందని తెలిపారు. దీని నివారణకు మోనోక్రాటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు, లేదా మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. బూడిద తెగులు, ఆంత్రాక్నోస్ మచ్చల తెగులు ఉన్న తోటల్లో బుప్రోఫెజిన్ 25 శాతం 1.5 మిల్లీలీటర్లు లేదా హెక్సాకొనోజోల్ 2 మిల్లీలీటర్లు, లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని సూచించారు. బ్యాక్టీరియా మచ్చ నివారణకు ఆక్సోక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని చెప్పారు. అనంతరం రైతులతో కలిసి తోటల్లో పర్యటించి వారి అనుమానాలను నివృత్తి చేశారు. ప్రభుత్వం రైతు సంఘాలకు ఉద్యానవన శాఖ ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుపై 75 శాతం రాయితీ ఇస్తోందని తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా' క్రికెట్ విజేత జట్టుకు సన్మానం



జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన రామకృష్ణాపురం క్రీడాకారులను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): ఆడుదాం..ఆంధ్రా జిల్లా క్రీడా పోటీల్లో క్రికెట్ విజేతగా నిలిచిన రామకృష్ణాపురం పురుషుల జట్టును బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించి అభినందించారు. పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు నిర్వహించిన క్రీడల్లో పెనుమూరు మండలం, రామకృష్ణాపురం జట్టు విన్నర్స్‌గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ సత్తా చాటి మండలం, జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు రూ.5వేల నగదును ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, నవీన్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీపతి, రాజారెడ్డి, నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రోజమ్మ మేలు మరువలేం



పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు: కడుపు నిండా మంచి భోజనం పెడుతున్న మంత్రి రోజమ్మ మేలు ఎప్పటికీ మరువలేమని పలువురు గర్భిణులు అన్నారు. బుధవారం స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వేచివుండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వాస్పత్రుల్లో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు యథావిధిగా విజిలబుల్ ఫలావ్, వైట్ రైస్, గుడ్డు, కరీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు జి.నారాయణస్వామి, పుష్పమ్మ, స్టాఫ్ నర్సు దిల్షాద్ పాల్గొన్నారు.

నారాయణస్వామిపై ఆరోపణలు తగదు



మాట్లాడుతున్న మర్రిపల్లికి చెందిన సోమశేఖర్

తిరుపతి కల్చరల్: ఆదరించి ఉపాధి కల్పించిన డెప్యూటీ సీఎం కె.నారాయణస్వామిపై ఆయన మాజీ పీఏ రమేష్ అసత్యపు ఆరోపణలు చేయడం తగదని ఎస్‌ఆర్ పురం మండలం మర్రిపల్లికి చెందిన ఎం.సోమశేఖర్, పాదిరి కుప్పానికి చెందిన పరంధామన్ తెలిపారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రమేష్ పలుకుబడిని ఉపయోగించుకుని అతని తండ్రి దొరస్వామి లైబ్రేరియన్, షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని 2021లో తమ నుంచి రూ.9 లక్షలు తీసుకున్నారని తెలిపారు. ఎంతకూ ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో అనేకసార్లు అతన్ని నిలదీశామని పేర్కొన్నారు. అతను నకిలీ అపాయింట్‌మెంట్, ప్లేస్‌మెంట్ లెటర్లు ఇచ్చి మోసం చేశాడని వాపోయారు. పీఏ రమేష్ మోసాలను గ్రహించిన నారాయణస్వామి అతన్ని పీఏగా తొలగించినట్టు తెలిపారు. తమకు జరిగిన అన్యాయాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేసి విచారణ చేయించి వాస్తవాలను వెలికితీయించారని చెప్పారు. డిప్యూటీ సీఎం చొరవతో తమకు రూ.8 లక్షలు తిరిగి వచ్చాయని, ఇంకా రూ.లక్ష రావాల్సి ఉందన్నారు. తనపై విచారణ చేయించారన్న అక్కసుతో డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై రమేష్ అసత్యపు ఆరోపణలు చేస్తున్నాడని దుయ్యబట్టారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మర్రిపల్లికి చెందిన మహేష్, గురప్ప పాల్గొన్నారు.

నారాయణస్వామితోనే నియోజకవర్గం అభివృద్ధి

- చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): ఏడు దశాబ్దాల తరువాత నియోజకవర్గం ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామితోనే అభివృద్ధి చెందిందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి అన్నారు. బుధవారం పెనుమూరు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, విద్యుత్, భూగర్భ గనుల శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. నియోజకవర్గంలో 50 పడకల ఆస్పత్రులను రెండు తీసుకొచ్చిన ఘనత డిప్యూటీ సీఎంకే దక్కుతుందన్నారు. ఎన్టీఆర్ జలాశయం ఆధునీకరణకు రూ. 180 కోట్లు మంజూరు చేయించారని, గతంలో ఎన్నడూ ఎన్టీఆర్ జలాశయాన్ని పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు ఓట్ల కోసం జలాశయాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించడం హాస్యాస్పందంగా ఉందన్నారు.మంత్రులపై అవాకులు, చెవాకులు పేలితే సహించేది లేదన్నారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, జిల్లా కో–ఆప్షన్ మెంబర్ అమీన్, ఎంపీటీసీ సుబ్రమణ్యంరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ హరికృష్ణ, దూదిమోహన్, దూదిమునేంద్ర, కిరణ్‌కుమార్‌రెడ్డి, దాము, పండరినాథ్, కృష్ణారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతలగుంటలో జల్లికట్టు జోష్







వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె పంచాయతీ చింతలగుంట దళితవాడలో బుధవారం జల్లికట్టు జోష్ తెచ్చింది. కోడెగిత్తల రంకెలు..యువత కేరింతలు మధ్య ఎడ్ల పందేలు అలరించాయి. ఎడ్లకు పలకలు,వస్త్రాలతో పాటు బెలూన్లు కట్టి పందేనికి సిద్ధం చేశారు. పలకల కోసం అల్లి వద్ద సిద్ధంగా యువత నిలబడడంతో నిర్వాహకులు ఎడ్లను ఉసిగొల్పారు. దీంతో రంకెలేస్తూ దూసుకుపోతున్న ఎడ్లను నిలువరించి, పలకలను దక్కించుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. కొందరు పలకలను దక్కించుకుని విజయగర్వంతో చిందులేశారు. ఎడ్ల పందేలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన జనంతో వీధులన్నీ కిక్కిరిసాయి.



దూసుకుపోతున్న కోడె గిత్తలు